క్లుప్తంగా

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను సత్కరించిన దృశ్యం

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. బేగం బజార్ కోల్సివాడి ప్రాంతాల్లో వాటర్‌బోర్డు మేనేజర్ సందీప్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని సహకారంతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు నందు, రాజేష్, కమల్, బాలకిషన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

గోల్కొండ: విద్యుత్ ఉద్యోగులకు గత సంవత్సరం ఏప్రిల్ నుంచి రావాల్సిన నూతన వేతనాలపై వెంటనే పీఆర్సీ ప్రకటించాలని విద్యుత్ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నానల్‌నగర్ వద్ద గల విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దక్షిణ మండల విద్యుత్ సరఫరా కంపెనీ లిమిటెడ్ ఈ ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల జేఈసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు.

మురుగు... పరుగు



మ్యాన్ హోల్ నుంచి పొంగి పొర్లుతున్న మురుగు

నాంపల్లి: మాలకుంట రోడ్డు సూర్యా మహల్ లేన్‌లో మురుగు పరుగులు పెడుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నిత్యం వ్యాపార సముదాయాలతో కిక్కిరిసిపోయి ఉంటుంది. వివిధ రకాల వస్తువుల కొనుగోలు నిమిత్తం బయట జిల్లాల ప్రజలు అధికంగా ఇక్కడికి వస్తుంటారు. ఆయా వస్తువుల కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలంటే మురుగునీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. స్థానికులు హిందీనగర్ వాటర్ వర్క్స్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీనగర్ వాటర్ వర్క్స్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పొంగుతున్నప్పటికీ మ్యాన్ హోల్స్ నుంచి ప్రవహిస్తున్న మురుగుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పొంగి ప్రవహిస్తున్న మురుగునీటి నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రాజేంద్రనగర్: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ దక్షిణమండలం జోన్ ఇన్‌చార్జి కమిషనర్ మంగతాయారు అన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణ చర్యలపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వ్యాపారులు, పలు సంస్థల నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, సంస్థల నిర్వాహకులు భద్రతాచర్యలు తీసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ లేని సంస్థల్లో వారం రోజుల్లో నిబంధనల మేరకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్ని మాపక విభాగం సమన్వయంతో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, సర్కిల్ ఏఎంహెచ్‌వో ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



వైద్య నిపుణుల బృందంతో కళాశాల విద్యార్థులు



ఐఎంవీ స్కూల్ సైన్స్ ఫెయిర్‌లో కార్పొరేటర్ దర్శన్, డైరెక్టర్ మిథిలేష్, గాలయ్య



మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో..

చార్మినార్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాల, రసాయన శాస్త్ర విభాగం, జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ నక్క లింగయ్య, అఖిల భారత రాష్ట్రీయ శిక్షా జాతీయ సంయుక్త కార్యదర్శి గుంతా లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, వైస్ ప్రిన్సిపాల్, రసాయన శాఖ అధిపతి డాక్టర్ ఏలూరి యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ దయానంద్, అమృత వసంత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ ఆకర్షించిన ఎగ్జిబిషన్..

సైన్స్ డే సందర్భంగా భౌతికశాస్త్ర విభాగం నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఉత్సాహంతో బయో ప్లాస్టిక్, ఓజోన్ సంరక్షణ, పర్యావరణ సంరక్షణకు అవసరమైన మోడల్స్ ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ బాలభాస్కర్, నైనా వినోదిని, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ చిన్ని కృష్ణ తదితరులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: ఫిజిక్స్‌లో రామన్ ఎఫెక్ట్ కనుగొని ప్రపంచాన్ని ఆశ్చర్య చకితుల్ని చేసిన సీవీ.రామన్ నోబెల్ బహుమతి, భారతరత్న పొందాడని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని పలు స్కూళ్లల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. రహింపురా కేటీఎస్, ఇంద్రాణి మహావిద్యాలయ, సరస్వతి విద్యానికేతన్, జియాగూడ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూళ్లల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఘనంగా జరిగాయి. పీస్ కమిటీ సభ్యులు నర్సింగ్‌రావు, ట్రస్మా ఆసిఫ్‌నగర్ మండల అధ్యక్షులు గాలయ్య,



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ఠాకూర్ రఘునందన్‌సింగ్, సునేత్ర కౌలే, అక్షదీప్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మహ్మద్ అక్రమ్ అలీ, మిథిలేష్ కుమార్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వెంకట్‌రావు మెమోరియల్ స్కూల్‌లో..

గౌలిపురా: నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని మంగళవారం వెంకట్‌రావు మెమోరియల్ స్కూల్‌లో ఏడీపీ సపోర్ట్‌తో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 45 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి హాజరై ప్రదర్శనను తిలకించారు. ఏడీపీ సీఎస్ఆర్ సందీప్, ప్రథమ్ కో ఆర్డినేటర్ ప్రతిమ, సైన్స్ ఎంటీ మోహన్, సీఐఎంలు దేవిక, మౌనిక, సుష్మా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో..

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అబ్బుర పరుస్తున్నాయని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ అన్నారు. ఆసిఫ్‌నగర్ సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ప్రిన్సిపాల్ పుష్పామేరితో కలిసి ప్రారంభించారు.



కార్యక్రమంలో ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ నక్క లింగయ్య, గుంతా లక్ష్మణ్

నిజాం కళాశాలలో...

గన్‌ఫౌండ్రీ: బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సైన్స్ అందరి కోసం అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమత తుళ్ల మాట్లాడుతూ.. మానవ పేగు ఆరోగ్యం, డయాబెటిక్స్‌లో సూక్ష్మజీవుల పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. కేర్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వినోద్‌బాబు మాట్లాడుతూ.. మన దైనందిన జీవితంలో శాస్త్రీయ అనువర్తనాల ప్రాముఖ్యతత, సంవత్సరాలుగా సాధించిన పురోగతిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా నాయక్, డాక్టర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా మంగళవారం సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు హాజరై 'సైన్స్ ఫెయిర్'ను ప్రారంభించారు. శ్రీచైతన్య స్కూల్ మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపల్ స్వాతి, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు పాల్గొన్నారు.

'మేరు కులస్తుల సేవలు అమూల్యమైనవి'



మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

చార్మినార్: సమాజంలో దర్జీ, మేరు కులస్తుల సేవలు అమూల్యమైనవని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. మంగళవారం దారుషిఫాలోని మేరు భవనంలో కోవూరు భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్ హోవ్ జయంతి సందర్భంగా ఈ రోజున ప్రపంచ టైలర్స్ డేను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విలియమ్ హోవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వకుళాభరణం మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో కొత్త సాంకేతికతలో వస్తున్న యంత్రాలను కొనుగోలు చేసుకొని వాటి ద్వారా వృత్తి ధర్మాన్ని ఆచరించి అభివృద్ధికి రావాలని ఆయన కోరారు. మేరు సంఘం రాష్ట్ర హడ్‌హాక్ కమిటీ ముఖ్య సలహాదారులు భాస్కర్‌రావు, మేరు ట్రస్ట్ చైర్మన్ పాడిశెట్టి నర్సింగ్‌రావు, ప్రతినిధులు ఆడప వెంకటేశ్వరరావు, దీపకొండ నర్సింగ్ రావు, కీర్తి శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ కార్నర్ మీటింగ్

గౌలిపురా: భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు మంగళవారం శక్తి కేంద్రం (40/48) ఇన్‌చార్జి కందడి ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్, అంబికానగర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌలిపురా కార్పొరేటర్, జిల్లా కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు ఆదర్ల మహేశ్, డివిజన్ అధ్యక్షులు రఘుకాంత్, మోకాళ్ల వెంకటేశ్, యాకుత్‌పురా నియోజకవర్గం కన్వీనర్ ధీరజ్‌లాల్, భానుప్రకాశ్, అశోక్, బొట్టు వెంకటేశ్, సాయి సందీప్, సాయి మధుకర్, సుమన్, బస్తీవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మిని పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.



కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

వేగవంతంగా అభివృద్ధి పనులు



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా

అబిడ్స్: వేగవంతంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులు అభివృద్ధి పనులు చేపడుతారని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల ఏర్పాట్లు, ఇతర మరమ్మతులు చేపడుతారని తెలిపారు. వేగవంతంగా గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా జీహెచ్‌ఎంసీ అభివృద్ధి పనులు చేస్తుందన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

చార్మినార్: కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ (కుడా) ఉద్యోగుల జీపీఎఫ్, సీపీఎఫ్‌లను వెంటనే చెల్లించాలని కుడా ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సయ్యద్ షంషాద్ ఖాద్రీ డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఉద్యోగంలో కొనసాగుతున్న ఇక్కడి ఉద్యోగులకు ఇప్పటి వరకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో హెల్త్ కార్డులు మంజూరు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాన కార్యదర్శి మహ్మద్ హషం, ఉపాధ్యక్షులు బహదూర్ ఖాన్,నాయకులు వెంకటేష్‌తో కలిసి కుడా కార్యాలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించి అధికారుల నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా దారుషిఫాలో కొనసాగుతున్న కుడా కార్యాలయాన్ని ఉన్నట్టుండి ఇక్కడి నుంచి తరలిస్తున్నారని చెబుతూ ఉద్యోగులను వెళ్లిపోవాలని ఆదేశించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు నిర్దిష్టమైన ఆదేశాలతో కూడిన పత్రాలు అందజేసేంత వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు, ఏళ్ల తరబడి పేరుకుపోయిన తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే..పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న సయ్యద్ షంషాద్ ఖాద్రీ

యువ పురస్కారానికి దరఖాస్తు గడువు పొడిగింపు

నాంపల్లి: జీఎల్.నర్సింహారావు యువ పురస్కారానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు వర్సిటీ రంగస్థల కళల శాఖ ప్రతి ఏటా మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జీఎల్.నర్సింహారావు పేరిట యువ పురస్కారాన్ని ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. నాటక రంగంలోని నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్, సాంకేతిక అంశాల్లో కృషి చేసిన కళాకారులకు అందజేస్తారు. 35 ఏళ్ల వయస్సు లోపు గల యువతి, యువకులకు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చును. 10 మార్చి 2023వ తేదీలోగా రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరిట పోస్టు ద్వారా లేదా స్వయంగా సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



బీజేపీ నాయకులకు సమస్యల చిట్టా చూపెడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

గోల్కొండ: బోజగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రం సమస్యల పుట్టగా మారిందని రాష్ట్ర బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన బోజగుట్టలో పర్యటించి అక్కడ ఉన్న బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కంపు కొడుతున్న టాయిలెట్లు ఉన్నాయని, వీటివల్ల చిన్నారుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రంలో ఉన్న సమస్యల చిట్టాను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభు పూజారి తదితరులున్నారు.

అన్నదానం



రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్, అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ చేయడంలోనే ఎంతో ఆనందం, తృప్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్, సహా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, శంకర్, వైదిక్ శాస్త్ర, ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు, ఎం.ఎ. ముజీబ్, ఎంఎన్‌జే ఆసుపత్రి సిబ్బంది అరుణజ్యోతి, శివకుమార్, చంద్రశేఖర్, వహీద్, మొహ్మద్ ముస్తఫా, షరీఫ్, ఉస్మానియా మెడికల్ కళాశాల కార్యదర్శి జగన్, విశాల తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కేన్సర్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

గోల్కొండ: మన దేశంలో కేన్సర్ వ్యాధి ఎంతో మందిని కబలిస్తుందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కేన్సర్ వ్యాధి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులతో పాటు జీవనశైలిలో చోటుచేసుకుంటున్న ఎన్నో కారణాల వల్ల కేన్సర్ సోకుతుందని ఆమె అన్నారు. అయితే చాలా మందికి కేన్సర్ పట్ల అవగాహన లేక ఆరోగ్యంపట్ల ఆలస్యం చూపుతున్నారన్నారు. వ్యాధి తీవ్రతలను గుర్తించడంలో ఎంతో మంది విఫలమవుతున్నారని, వ్యాధి అంతిమదశకు వచ్చేసరికి అతి ప్రాణాంతకంగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. ఏ రోగానైనా సరే వ్యాధి నిర్ధారణ పరీక్షల వల్ల తెలుసుకోవచ్చని, నిర్ధారణ అయిన అనంతరం నిపుణులైన వైద్యులు కచ్చితమైన చికిత్సలను అందించి ప్రాణాలను కాపాడగలుగుతున్నారని ఆమె అన్నారు. అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ సర్జన్ ఆకాశ్ రాజ్, కేన్సర్ చికిత్సలో వస్తున్న నూతన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా, ఏఏఓడాక్టర్ శ్రీనివాస రావు, వైద్యుల సిబ్బంది తదితరులున్నారు.

'ప్రజలకు అండగా మజ్లిస్'

గోల్కొండ: ప్రజలకు మజ్లిస్ అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గం నుంచి పలువురు వచ్చి ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ పేద బడుగు వర్గాల వారికి సేవ చేయడానికే ఉందని, వారి మద్దతుతోనే తమ పార్టీ నేడు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా విస్తరించిందని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు మజ్లిస్ నాయకులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. బార్కాస్, సలాల, అన్వర్ మిర్చి, బాబానగర్, బాలాపూర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు. కేశవగిరి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సరఫరా ఉండదన్నారు. కందికల్‌గేట్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు. రక్షాపురం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో...

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- 33/11 కేవీ సరోజినిదేవి కంటి ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని మురాద్‌నగర్, చోటామసీద్, సయ్యద్ అలిగుడ, ఆలపాటి నగర్, కాల్విన్ హోటల్, చిల్లా పిటి, అహ్మద్‌నగర్, ఫస్ట్‌లాన్సర్, బోలానగర్, కబరస్థాన్, బడాబజార్, పోచమ్మ బస్తీ, ఖాజానగర్, హాషం కాంపౌండ్, షైనీ పాఠశాల, నాయి బస్తీ, మిలటరీ వాల్, మాసబ్‌ట్యాంక్, గార్డెన్ టవర్స్, పోలీస్ మెస్, ఖాజా మెన్షన్, ఖాదీ బోర్డు, డైమండ్ హోటల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. అలాగే 33/11 కేవీ గుడిమల్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్, ఎంఐజీహెచ్, మురాద్‌నగర్ కుంట, ఆసిఫ్‌నగర్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు, రెహనుమా డెక్కన్, మిలాన్ టాకీస్, జేబాబాగ్, హుడా కాలనీ, అలీనగర్, ప్రియా కాలనీ, జయనగర్, నవోదయ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యుత్ మీటర్ రీడింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఏజేసీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: విద్యుత్‌శాఖలో 23 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్స్ రీడర్స్ యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, బ్యాంక్ ద్వారా జీతాలు తీసుకుంటున్నప్పటికీ తమను రెగ్యులర్ చేయడంలో తీవ్ర కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ సర్కిల్ అధ్యక్షుడు కె.బాబ్జీ, ఎ.శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, నయీమ్, జి.సురేష్ గౌడ్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

కఠిన చట్టాలను తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ

సుల్తాన్‌బజార్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతులు, మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోయాయని, వాటిని నివారించేందుకు కఠిన చట్టాలను తీసుకురావాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మహిళలకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మహిళల హక్కులపై గతంలో ఎన్నడూ లేనంతగా దాడులు జరుగుతున్నాయని, కుల, వర్ణ మత వివక్షతను కేంద్రం పెంచిపోషిస్తుందని ఆరోపించారు. పీఓడబ్ల్యూ నాయకురాలు కావేరి, పుష్ప, సంతోషి పాల్గొన్నారు.

'తెలంగాణలో అవినీతి పాలన'

గోల్కొండ: తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ టోలిచౌకి డివిజన్ అధ్యక్షుడు బొమ్మల శ్రీకాంత్ చారి అన్నారు. మంగళవారం టోలిచౌకి డివిజన్ రిసాల బజార్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ చారి మాట్లాడుతూ.. ప్రభుత్వ అధినేత అవినీతిని ప్రోత్సహిస్తున్నారని, ప్రజా సంక్షేమం మరిచి కుటుంబ సంక్షేమం కోసమే పని చేస్తున్నాడని ఆయన విమర్శించాడు. రాష్ట్రంలో పాఠశాల నుంచి మెడికల్ విద్యార్థుల వరకు ర్యాగింగ్ భూతం కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అయితే ప్రభుత్వం మాత్రం ఇవేవి పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, జగదీశ్, ప్రసన్న, సాయిబాబాచారి తదితరులున్నారు.



బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న శ్రీకాంత్ చారి

గంజాయి విక్రేత అరెస్ట్



గోపాల్ సింగ్

అబిడ్స్: పేరుమోసిన రౌడీషీటర్, గంజాయి విక్రేత గోపాల్‌సింగ్(49)ను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అతని ఇద్దరు కుమారులు పరారీలో ఉన్నట్లు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్పర్ ధూల్‌పేట గంగాబౌలీకి చెందిన గోపాల్‌సింగ్‌పై మంగళ్‌హాట్ ఠాణాలో రౌడీషీటర్ నమోదయ్యింది. అతని కుమారులైన ఆనంద్‌సింగ్ (25), విజయానంద్(20)తో కలిసి గంజాయి సామ్రాజ్యాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్ పోలీసులు అతని ఇంటిపై దాడి జరిపి గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న గోపాల్‌సింగ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని 1.2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతని కుమారులు ఇద్దరూ పరారీలో ఉండగా ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించినట్లు డీసీపీ తెలిపారు. ధూల్‌పేట కేంద్రంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే హెచ్చరించారు. గంజాయి విక్రయదారులు, వారికి సహకరిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఇందు కోసం ప్రత్యేక మెరుపు దళాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు.

బైరి నరేష్‌పై సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు



సుల్తాన్‌బజార్: హిందూ దేవతలపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందూవుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా మాట్లాడుతున్న బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని బజరంగ్‌దళ్ నాయకులు అభిషేక్ కుమార్, శ్రీనివాస్ మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాల గంగిరెడ్డి న్యాయ నిపుణుల సలహా మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం అభిషేక్ కుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. అయ్యప్పస్వామిపైన అనుచిత వ్యాఖ్యలు చేసి అందరి హిందూవుల మనోభావాలు బైరి నరేష్ అనే వ్యక్తి దెబ్బతీశారన్నారు. ఈ కేసును ఎస్సై సుజాత దర్యాప్తు చేస్తున్నారు.